క్లుప్తంగా

ముగిసిన సదరం క్యాంప్



తెనాలిఅర్బన్: వికలాంగుల ధ్రువపత్రాలను పునః పరిశీలన జరిపే కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరం క్యాంప్ శుక్రవారంతో ముగిసింది. ఆర్థో, ఈఎన్‌టీ, సైక్రాటిక్ విభాగాలకు చెందిన వికలాంగులు వైద్యశాలకు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమాన్ని వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి పర్యవేక్షించారు.

సెయింట్‌పాల్స్ విద్యార్థినికి ప్రతిభ అవార్డు



తెనాలిటౌన్: స్థానిక నాజర్‌పేటలోని సెయింట్‌పాల్స్ ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థిని మార్చి 2025లో జరిగిన ఇంటర్మీడియట్ ఒకేషనల్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎంఏ లింకన్‌బాబు తెలిపారు. దేవరకొండ హేమీమా, ఎల్ఎంఅండ్‌డీ (వెటర్నరీ) ద్వితీయ సంవత్సరంలో 1000 మార్కులకుగాను 928 సాధించినట్లు తెలిపారు. కమిషనర్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ నుండి ఆ విద్యార్థినికి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిభ అవార్డు ప్రకటించినట్లు పేర్కొన్నారు. కాలేజీ స్థాపించిన నాటి నుంచి ఇప్పటివరకు 10 ప్రతిభా అవార్డులు కళాశాల విద్యార్థులు సాధించినట్లు వెల్లడించారు. ప్రతిభా అవార్డు సాధించిన విద్యార్థినిని శుక్రవారం కళాశాల కరస్పాండెంట్ ఎస్.షీలా సుజని, అధ్యాపకులు డాక్టర్ స్వేచ్ఛ, కీర్తి అబ్రహాంలు అభినందించారు.

సాంకేతిక విద్యతో మంచి భవిష్యత్

తెనాలి ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రావి చిన్న వెంకటేశ్వర్లు



తెనాలిఅర్బన్: సాంకేతిక విద్యను అభ్యసించిన వారికి మంచి భవిష్యత్ ఉంటుందని తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రావి చిన వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. చినరావూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శుక్రవారం ఐటీఐ ప్రవేశాల కౌన్సిలింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో చదివేందుకు 298 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. వీరందరి మెరిట్ ఆధారంగా ఆయా ట్రేడ్‌లో అడ్మిషన్లు ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలి



తెనాలిటౌన్: ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పథకం ద్వారా జీవనోపాధి కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీవో అత్తోట దీప్తి పేర్కొన్నారు. శుక్రవారం రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆమె పర్యవేక్షించారు. ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్న తరుణంలో అవసరమైన కాల్వల పూడికతీత, మట్టి పనులను వేగవంతం చేయాలని ఎన్ఆర్‌జీఎస్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతి ప్రదానం



తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు గ్రామంలోని శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శుక్రవారం బహుమతి ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా పంచాయతీ కార్యదర్శి ఎండీ కరిముల్లా పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఏప్రిల్ 28వ తేదీ నుండి జూన్ 6వ తేదీ వరకు 40 రోజుల పాటు శాఖాగ్రంథాలయం ఆధ్వర్యంలో చిన్నారులు, విద్యార్థులకు డ్రాయింగ్, ఎస్సే రైటింగ్, డ్యాన్స్, చెస్ కాంపిటీషన్స్ వంటివి నేర్పి పోటీలు నిర్వహించి విజేతలు అయిన వారికి బహుమతులు ఇవ్వడం అభినందనీయమని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి కడియాల సుజాత, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

• శ్రీనివాసా.. గోవింద



గోవింద నామార్చన చేస్తున్న చిన్నారులతో నిర్వాహకులు

తెనాలి: జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి సందర్భంగా శుక్రవారం శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం, 108 మందిచే గోవింద నామార్చనను నిర్వహించారు. శ్రీవెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని జరిపారు. తొలుత చిన్నారులతో స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించారు. అనంతరం ధ్వజస్తంభం నుంచి ప్రదక్షణగా మాడవీధులలో గోవిందనామ సంకీర్తన, కోలాట ప్రదర్శన చేసుకుంటూ మూడుసార్లు ఆలయ ప్రదక్షిణ చేశారు. దేవస్థానం కల్యాణ మండపానికి చేరి పిల్లలందరిచే గోవింద నామ సంకీర్తనలు చెప్పించారు. ఆలయ అర్చకులచే రిషిక్‌శ్రీ, అందె తన్మయి, దేవిలలిత, హరిప్రియ, ప్రవస్థి, తులసికి జ్ఞాపికలను బహూకరించారు. ఆలయ సిబ్బంది చిన్నారులకు ప్రసాదం అందజేశారు. పిల్లల్లో భక్తిభావం పెంపొందించేందుకే ఈ కార్యక్రమం చేస్తున్నామని కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు తెలిపారు. డిసెంబర్ నెలలో తిరుమలలోనూ గోవిందనామ సంకీర్తన చేయించాలని భావిస్తున్నామని చెబుతూ, ఆసక్తి గలవారు ప్రతి ఆదివారం శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో గోవిందనామాలు నేర్చుకోవచ్చని సూచించారు. సభ్యులు అందె బాలచంద్రమౌళి, కేశవరావు, దేవానంద్, భారతీదేవి, రమాదేవి, రజిని, వాసవి, సావిత్రి, సుజాత పాల్గొన్నారు.

యోగాంధ్ర కార్యక్రమాల్లో పాల్గొనండి



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు



పోటీల్లో పాల్గొన్న ప్రజలు

తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలిఅర్బన్: యోగాంధ్ర కార్యక్రమాల్లో అందరూ పాల్గొనాలని తెనాలి తహసీల్దార్ గోపాలకృష్ణ పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో శుక్రవారం నిర్వహించిన వ్యాసరచన, క్విజ్, వక్తృత్వం వంటి పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అంతర్జాతీయ యోగా వేడుకలను నిర్వహిస్తుందని తెలిపారు. దీనిలో భాగంగా మనరాష్ట్రంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ యోగాను ప్రమోట్ చేసేందుకు కేంద్రం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. యోగా చేయడం వలన ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, మేనేజర్ విల్సన్ జయకర్, ఆర్‌వో రాంప్రసాద్, ఏసీపీ శివన్నారాయణ, పలువురు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకపఠనం జీవితంలో భాగం కావాలి

తెనాలిఅర్బన్: పుస్తక పఠనం జీవితంలో భాగం కావాలని తెలుగు ఉపాధ్యాయులు అబ్దుల్ హుస్సేన్, లక్కరాజు లక్ష్మణరావు పేర్కొన్నారు. నెహ్రూరోడ్డులోని శాఖా గ్రంథాలయంలో గత నెల 28 నుంచి జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యవలన విజ్ఞానం పెంపొందుతుందని చెప్పారు. ప్రతివ్యక్తి నిత్య విద్యార్థిలాగా జీవించాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో వస్తున్న మార్పులను తెలుసుకోవాలంటే పఠనం ఎంతో అవసరమన్నారు. అనంతరం పాటలు, వ్యాసరచన, కథలు చెప్పడం, చిత్రలేఖనం, పద్యాలు, క్యారమ్స్, చెక్ వంటి పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బొల్లిముంత కృష్ణ, గ్రంథాలయాధికారి కె.పూర్ణచంద్రరావు, రికార్డ్ అసిస్టెంట్ లావణ్య సుధ, కె.పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.



గెలుపొందిన చిన్నారులతో కృష్ణ, పూర్ణచంద్రరావు

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

ఎంపీడీవో అత్తోట దీప్తి

తెనాలిటౌన్: పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు ప్రాధాన్యతను ఇవ్వాలని ఎంపీడీవో అత్తోట దీప్తి సూచించారు. శుక్రవారం రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో సిబ్బందితో కలిసి పర్యటించారు. గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. గ్రామాన్ని నాలుగు భాగాలుగా విభజించి ప్రత్యేక శానిటేషన్ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎస్సీ కాలనీలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కాల్వల్లో షిల్ట్ తీయడం, రోడ్లు, మురుగు కాల్వల వెంబడీ పిచ్చిమొక్కలు, అడ్డంకులు తొలగించడం, శానిటేషన్ మెరుగుపరచడం వంటి కార్యక్రమాలు ప్రతిరోజు నిర్వహించాలని వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వైవీడీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఎండీ కరిముల్లా, ఇంజనీరింగ్, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.



కొలకలూరు గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో దీప్తి

ధర్నా జయప్రదం చేయండి

తాడేపల్లి రూరల్: మంగళగిరి వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద కౌలు రైతుల సమస్యలపై ఈనెల 11వ తేదీన జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ వ్యవసాయ శాఖ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు పిలుపునిచ్చారు. శుక్రవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో కౌలు రైతులను కలిసి కరపత్రాలు అందజేస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అప్పారావు మాట్లాడుతూ.. నూటికి 70 శాతం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న వాస్తవ సాగుదారులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో భాగంగా కౌలు రైతులను గుర్తించి పంట ఈ క్రాప్ చేసి రుణాలు ఇస్తామని చెప్పి, ఇప్పుడు కౌలు రైతులను మోసం చేస్తోందని విమర్శించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద కౌలు రైతులకు రూ.20 వేలు ఇస్తామని చెప్పారని అన్నారు. కార్యక్రమంలో ఏపీ కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, కౌలు రైతులు కొండపల్లి పూర్ణచంద్రరావు, గంధం కొండయ్య, సాంబయ్య, పులివర్తి దిబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.



కౌలు రైతులతో మాట్లాడుతున్న అప్పారావు

రైతులకు ఇచ్చిన ప్లాట్లను అభివృద్ధి చేయాలి

తాడేపల్లి రూరల్: రాజధాని ప్రాంతంలో రైతులకు ఇచ్చిన ప్లాట్లను వెంటనే అభివృద్ధి చేయాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఉండవల్లిలోని ప్రజా సంఘాల కార్యాలయంలో జగదీశ్వర్ రెడ్డి అధ్యక్షతన రాజధాని సంఘం కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జొన్న శివశంకరరావు మాట్లాడుతూ.. చారిత్రాత్మక రైతు ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం మద్దతు ధరల కమిటీని ఏర్పాటు చేయలేదని అన్నారు.

ఆధ్యాత్మిక రంగంలో రాంబాబుకు డాక్టరేట్

రేపల్లె: బాపట్ల జిల్లా రేపల్లె మండలం మోళ్లగుంట గ్రామానికి చెందిన పీతా రాంబాబు అమెరికాకు చెందిన డేస్ప్రింగ్ థియోలాజికల్ టెక్సాస్ అమెరికా యూనివర్శిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఆధ్యాత్మిక రంగంలో రాణిస్తున్న ఆయన సేవలను గుర్తించిన వర్సిటీ గౌరవ డాక్టరేట్‌కు ఎంపిక చేసింది. ఈనెల 4న హైదరాబాద్‌లో జరిగిన ఓ సదస్సులో రాంబాబుకు సినీతారలు తిరుపతి దొరయ్య స్వామి, పృధ్వీరాజు, శ్రీనివాస్, బాబూమోహన్‌లు యూనివర్శిటీ ప్రొఫెసర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో డాక్టరేట్ పట్టాను అందజేశారు. రాంబాబుకు రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్, వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.



రాంబాబుకు డాక్టరేట్ అందిస్తున్న వర్శిటీ ప్రొఫెసర్ వరప్రసాద్, క్యారెక్టర్ ఆర్టిస్ట్ శ్రీనివాస్

రోడ్ల వెంట వ్యర్థాలను తొలగించండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: రోడ్ల వెంట ఉన్న వ్యర్థాలను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. ఐతానగర్ గోలిడొంకలో శుక్రవారం ఉదయం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వాహణ పనులను పరిశీలించారు. రోడ్ల వెంట వ్యర్థాలు ఉండటాన్ని గమనించిన ఆయన వాటిని తొలగించి రోడ్డును శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆయన వెంట ఏఈ సూరిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నజీర్, పలువురు మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

8న సీనియర్ సిటిజన్లకు యోగా

తెనాలి: స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఈనెల 8వ తేదీన సీనియర్ సిటిజన్లకు యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఈనెల 21వ తేదీన జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ముందస్తుగా సీనియర్ సిటిజన్లకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అసోసియేషన్ సభ్యులంతా ఆరోజు ఉదయం 6.30 గంటలకు వీజీకే భవన్‌కు చేరుకోవాలని సూచించారు.

జనాభా నిర్వహణ విధానంపై గ్రామ సభలు

తాడికొండ: ప్రభుత్వ ఆదేశాల మేరకు తాడికొండ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో జనాభా నిర్వహణ విధానంపై గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎ.సమతా వాణి తెలిపారు. ఈ మేరకు మండలంలో గ్రామ పంచాయతీల వారీగా 'జనాభా నిర్వహణ విధానం.. పర్ఫి కుటుంబం.. మీ అభిప్రాయం మార్గ దర్శనం'కు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేశారు. ఈనెల 9వ తేదీన బండారుపల్లి, బేజాత్పురం, గరికపాడు, ముక్కామల, ఫణిదరం.. 10న కంతేరు, ఎల్‌జీ పూడి, మోతడక, నిడుముక్కల, పాములపాడు, పొన్నెకల్లు, రావెల.. 11న తాడికొండ గ్రామాలలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లి రూరల్: ప్రభుత్వం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేములు దుర్గారావు కోరారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలను సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల పట్ల ప్రభుత్వాలు ఏ దృక్పథంతో ఉన్నాయో సిమెంట్ ఫ్యాక్టరీ సమస్య చూస్తే అర్థమవుతోందని అన్నారు. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడం వల్లే సమస్య పరిష్కారానికి నోచుకోలేదని విమర్శించారు. కార్యక్రమంలో స్టీవెన్, ఇస్మాయిల్, సాంబయ్య, గురవ య్య, తుపాకుల నాగేశ్వరరావు, దుర్గాభవాని, శార ద, రమణమ్మ, సారమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

స్వర్ణకారుల కుటుంబాల అభ్యున్నతికి కృషి

కర్లపాలెం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ-4 సర్వేలో గుర్తించిన స్వర్ణకారుల కుటుంబాల అభ్యున్నతికి మార్గదర్శకులు కృషి చేయాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు సూచించారు. ఏట్రవారిపాలెంలో శుక్రవారం జరిగిన గ్రామసభలో ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో మొత్తం 2,293 బంగారు కుటుంబాలను గుర్తించామని తెలిపారు. వీటిలో 33మంది మార్గదర్శకులు 289 కుటుంబాలను దత్తత తీసుకున్నారని చెప్పారు. బంగారు కుటుంబాలు సామాజికంగా, ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు మార్గదర్శకులు కృషి చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల అర్జీలు క్రమేణ పరిష్కరిస్తాం



అర్జీలు స్వీకరిస్తున్న సూర్యసాయి ప్రవీణ్‌చంద్

తాడికొండ: రాజధాని ప్రాంతంలో రైతులు, రైతు కూలీలు ఇచ్చిన అర్జీలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని ఏపీ సీఆర్డీయే అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ సూచించారు. శుక్రవారం తుళ్లూరులోని ఏపీ సీఆర్డీయే ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆయన రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసైన్డ్ భూముల సమస్యలు, వీధిపోటు సమస్యలపై పలువురు రైతులు అర్జీలను అందజేశారన్నారు. ఈ అర్జీలపై ప్రభుత్వ ఆదేశానుసారం చర్యలు తీసుకుని ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామన్నారు. పరిష్కారాలపై సంబంధిత శాఖలకు ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో మొత్తం 23 ఫిర్యాదులు అందాయన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు బి.సాయి శ్రీనివాస నాయక్, ఎం.శేషిరెడ్డి, కేఎస్ భాగ్యరేఖ, పి.పద్మావతి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బక్రీదు పండుగను సంతోషంగా జరుపుకోండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: బక్రీదు పండుగను సంతోషంగా జరుపుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. శివాజీచౌక్‌లోని జమీయా మసీదులో శుక్రవారం ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం మసీదులో బక్రీదు సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరగనున్నట్లు చెప్పారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. ఇంకా ఏమైనా చేయాల్సి వస్తే తమకు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో ఆర్‌వో రాంప్రసాద్, ఏసీపీ శివన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిభా అవార్డుకు చిరుహాసిని



తెనాలి: పదోతరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం బహూకరించే ప్రతిభా అవార్డుకు చిరువ్యాపారి కుమార్తె ఎంపికైంది. స్థానిక నారాయణ స్కూల్‌లో పదోతరగతి చదివిన బాలిగ చిరుహాసిని గత మార్చిలో జరిగిన పరీక్షల్లో 582/600 మార్కులతో ఉత్తీర్ణురాలైంది. ఎస్టీ వర్గానికి చెందిన చిరుహాసిని చదువు కోసం తండ్రి బాలిగ శివన్నారాయణ ఏడాదిగా తెనాలిలోనే నివసించారు. ఆయన స్వగ్రామం తెనాలి సమీపంలోని బాపట్ల జిల్లా మండల కేంద్రం వేమూరు. అక్కడ పొట్టేలు మాంసం విక్రయిస్తూ జీవిస్తుంటారు. ఎల్‌కేజీ నుంచి అయిదో తరగతి వరకు వేమూరులోని శ్రీవివేకానంద స్కూలులో చదివిన చిరుహాసిని, అయిదో తరగతి నుంచి తెనాలిలోని నారాయణ స్కూలులో చదివింది. ప్రతిరోజూ ఊరి నుంచి స్కూలు బస్సులో వచ్చిన చదువుకుంది. పదో తరగతిలో బిడ్డను శ్రద్ధగా చదివించుకుందామని తల్లిదండ్రులు సుధాలక్ష్మి, శివన్నారాయణలు ఏడాదిగా ఇక్కడే కాపురం ఉన్నారు. బిడ్డ తెలివితేటలు, శ్రమకు తగిన ఫలితం దక్కిందని ఆ దంపతులు మురిసిపోతున్నారు.

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్‌లో తెనాలికి పతకాల పంట

జాతీయ పోటీలకు ఆరుగురు ఎంపిక



పతకాలు సాధించిన లిఫ్టర్లతో కేవీ గోపాలకృష్ణ, సాయిరేవతి

తెనాలి: ఒంగోలులో మే 31వ తేదీ నుంచి జూన్ రెండో తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక 'క్విక్' అకాడమీకి చెందిన విద్యార్థులు అసాధారణ ప్రతిభను ప్రదర్శించారు. పోటీల్లో పాల్గొన్న యువతీ యువకులు మొతత 20 పతకాలను సాధించినట్టు అంతర్జాతీయ గోల్డ్ మెడలిస్ట్, కోచ్ ఘట్టమనేని సాయిరేవతి చెప్పారు. తమ విద్యార్థులు మదిర షానూన్-2 పతకాలు, ఏటూరి లక్ష్మీవినయశ్రీ-స్వర్ణం, రజతం, బొల్లు లిఖిత-4, హిమ సాయిబిందు రెండు పతకాలను సాధించగా, టి.మణిచంద్-2 స్వర్ణాలు, ఎస్.మనీశ్వరరామ్ స్వర్ణం, ఎస్.కౌశిక్ 4 పతకాలు, వై.ఫణీత్ రజతం, జి.కుమార్ ధర్మతేజ రజతం సాధించారు. వీరిలో మదిర షానూన్, ఏటూరి లక్ష్మీవినయశ్రీ, బొల్లు లిఖిత, టి.మణిచంద్, ఎస్ మణీశ్వర రామ్, ఎస్.కౌశిక్‌లు జాతీయ పోటీలకు అర్హత పొందారని వివరించారు. తెనాలి మండల తహశీల్దార్ కేవీ గోపాలకృష్ణ శుక్రవారం అకాడమీని సందర్శించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కోచ్‌లు సాయిరేవతి, పూసపాటి శివరామకిరణ్‌రాజు, నిర్వాహకులు కొమ్మినేని భార్గవ్‌కుమార్ పాల్గొన్నారు.

కామ్రేడ్ బొల్లిముంత శివరామకృష్ణ సేవలు చిరస్మరణీయం



శివరామకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

తెనాలిటౌన్: సినీ రచయిత, అభ్యుదయవాది కామ్రేడ్ బొల్లిముంత శివరామకృష్ణ సేవలు చిరస్మరణీయమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం బొల్లిముంత శివరామకృష్ణ వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ పాల్గొని శివరామకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బొల్లిముంత శివరామకృష్ణ సమాజానికి మార్గదర్శిగా నిలిచారని సినీ రచయితగా అభ్యుదయ భావాలు పంచారని ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. భవితరాలను ఆయన చూపిన మార్గం ముదావహమని కొనియాడారు. కార్యక్రమంలో చెరుకుమల్లి సింగారావు, వజ్రాల రామలింగాచారి, ఎస్.కిరణ్ బాబు, బొల్లిముంత కృష్ణ, కనపర్తి బెనహర్, పాశం వెంకటేష్, జి.శివ, ఎం.హనుమంతరావు, రామారావు, ప్రేమ్, విజయ్, తదితరులు ఉన్నారు.

ఏకలవ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలి

ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ ఎరుకల సేవా సంఘం వినతి



జేసీ భార్గవ్‌తేజకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

తెనాలి: తమ ఆరాధ్య దైవమైన ఏకలవ్య మహారాజు జయంతిని రాష్ట్రప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ ఎరుకల సేవాసంఘం విజ్ఞప్తిచేసింది. సేవాసంఘం రాష్ట్ర కమిటి ఆదేశాలతో జిల్లా కమిటి నాయకులు శుక్రవారం గుంటూరులో జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ ఎరుకల సేవాసంఘం రాష్ట్ర కమిటీ తరపున గుంటూరు జిల్లా కమిటీ, గిరిజన సంఘాల తరపున ఈ విజ్ఞాపన చేసినట్టు తెనాలిలో ఒక ప్రకటనలో తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ శంకరరావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గరిక శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర జగదీష్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి పాలపర్తి ఆదినారాయణ, గిరిజన నాయకులు మేడ రామకృష్ణ, యుటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కుందనాటి సంజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు మేడసరి వెంకటరామయ్య పాల్గొన్నారు.

నేడు అంబేద్కర్ విగ్రహావిష్కరణ



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

తెనాలిఅర్బన్: కొల్లిపర మండలం తూములూరు గ్రామంలోని క్రిష్టియన్‌పాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో అందరూ పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. తెనాలిలో శుక్రవారం సాయంత్రం విగ్రహావిష్కరణకు సంబంధించిన వాల్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం సాయంత్రం 5గంటలకు సీనియర్ ఐపీఎస్ అదికారి పివి.సునీల్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని విగ్రహావిష్కణ చేయనున్నట్లు చెప్పారు. అలాగే వేమూరు, తాడికొండ ఎమ్మెల్యేలు నక్కా ఆనంద్‌బాబు, తెనాలి శ్రావణ్‌కుమార్, మాజీమంత్రి మేరుగ నాగార్జున, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారులు ఉప్పులేటి దేవి ప్రసాద్, మేకతోటి దయాసాగర్, తదితరులు పాల్గొంటారని చెప్పారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్ తెనాలి మోహనరావు, మాజీ సర్పంచ్ బేతాళ భూషణం, కనపర్తి సుధాకర్, అక్కిదాసు కిరణ్‌కుమార్, జిడుగు పీటర్, గల్లా జ్ఞాన శేఖర్, డాక్టర్ కనపర్తి అబ్రహాం లింకన్, బి.సతీష్, తదితరులు పాల్గొన్నారు.